క్లుప్తంగా

శివాలయానికి భూమి వితరణ



ఆలయ నిర్వాహకులకు భూమి డాక్యుమెంట్లు అందిస్తున్న జయశ్రీ

పెనుబల్లి: మండలంలోని వీయంబంజర్ ఎన్నెస్పీ కాలువ వద్ద ఉన్న శివాలయానికి వీయంబంజర్‌కు చెందిన యారం జయశ్రీ 4 కుంటల వ్యవసాయ భూమిని వితరణగా అందజేశారు. జయశ్రీ తాళ్లపెంట రెవెన్యూ పరిధిలోని 4 కుంటల వ్యవసాయ భూమి డాక్యుమెంట్లను ఆలయ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో రామకృష్ణ, శ్రీను, రామచంద్రయ్య, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఓ మయాన్ మంజుఖాన్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామంలో యాసంగిలో మొక్కజొన్న సాగుపై మండల వ్యవసాయశాఖ అధికారి మయాన్ మంజుఖాన్ రైతులకు అవగాహన కల్పించారు. యాసంగిలో మొక్కజొన్న సాగు రైతులు విత్తన కంపెనీ ప్రతినిధుల నుంచి అగ్రిమెంట్ బాండ్ రాయించుకోని మొక్కజొన్న వేయాలని సూచించారు. అనంతరం ఆడ, మగ మొక్కజొన్న సాగు వలన కలిగి లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేష్, రైతులు కొల్లి శ్రీనివాసరావు, గొల్లపూడి హరినాథ్, దండ్యాల కృష్ణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబం నుంచి ముగ్గురికి ప్రభుత్వ ఉద్యోగాలు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు టీచర్ ఉద్యోగాలు సాధించారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన గ్రామానికి చెందిన ఈలప్రోలు కృష్ణారావు స్కూల్ అసిస్టెంట్, ఈలప్రోలు నరేష్, సునీత ఇద్దరు ఎస్జీటీగా విధుల్లో చేరారు. ఒకే కుటుంబంలో ముగ్గురికి టీచర్ ఉద్యోగాలు రావటంతో వారికి కుటుంబసభ్యులు, అధికారులు, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.


జాతీయస్థాయి ఉషూ పోటీలకు ఎంపిక

కారేపల్లి: మండలంలోని కారేపల్లి మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి ఉషూ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన ఉషు పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అండర్-17, 19 విభాగాల్లో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా మోడల్ కళాశాలలో చదువుతున్న స్పందన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా వీరిని ప్రిన్సిపాల్ ఇలియాట్ ప్రేమ్‌కుమార్ పీఈటీ మూసా, అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: తల్లాడ టౌన్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని తల్లాడ విద్యుత్ ఏఈ రాయల ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తల్లాడ, నారాయణపురం, మల్లారం గ్రామాల విద్యుత్ వినియోదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ఏపూరి వెంకటేశ్వర్లు

సత్తుపల్లిరూరల్: స్థానిక కళాభారతిలో ఎమ్మార్పీఎస్ సంఘం మండల ఇన్‌చార్జ్ గొల్లమందల ముత్తారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు ఏపూరి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడెలు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నూతన మండల కమిటీ ఎన్నికోవటం జరిగిందన్నారు. నూతన మండల కమిటీ అధ్యక్షుడిగా అశోక్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా శివకృష్ణ, తుకారం, ప్రచార కార్యదర్శిగా రాఘవ, కార్యవర్గ సభ్యుడిగా విష్ణులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మణ్, దేవన్న, దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' స్పెల్ బీ విజయవంతం



విద్యార్థులకు ప్రశ్నపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మధిర: మధిర పట్టణంలోని నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్, శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్‌లో సోమవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ ఇంగ్లిష్ పరీక్ష విజయవంతమైంది. పెద్దసంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పరీక్ష రాశారు. ప్రశ్నాపత్రాలను పాఠశాల కరస్పాండెంట్ బోనగిరి నారాయణరావు అందజేసి పరీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాక్షి ఆధ్వర్యంలో గత అనేక సంవత్సరాలుగా స్పెల్ బీ, మ్యాథ్స్ బీ పరీక్షలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఇటువంటి పోటీ పరీక్షల ద్వారా విద్యార్థులకు పరీక్షలపై భయం తొలగిపోతుందని, అంతేకాకుండా జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ఆంగ్ల భాషపై పట్టు వస్తుందని పేర్కొన్నారు. అలాగే, పోటీ పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటి ప్రతిభను మెరుగుపరుచుకునేందుకు సాక్షి స్పెల్ బీ దోదపడుతుందన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తూనే విద్యార్థుల అభ్యున్నతికి ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్న సాక్షి యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బోనగిరి వనజ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు అంటే భయం పోతుంది..



సాక్షి ఆధ్వర్యంలో ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు.. పరీక్షలంటే భయం పోతుంది. ఈ సారి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అవుతాననే నమ్మకం ఉంది.

– ఎస్.ధనుష్, 10వ తరగతి, నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్

'సాక్షి' యాజమాన్యానికి కృతజ్ఞతలు..



పోటీ పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయవచ్చు. సాక్షి నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్ష విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుంది. పరీక్షలను విద్యార్థులు ఉత్సాహంగా రాశారు. సాక్షి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– బోనగిరి నారాయణరావు, నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్ అధినేత

ఇంగ్లిష్ అంటే ఇష్టం..



ఇంగ్లిష్ సబ్జెక్టు అంటే చాలా ఇష్టం. సాక్షి ఆధ్వర్యాన పరీక్షలు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తారని తెలిసింది. పరీక్ష రాయమని ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తే మిగిలిన అన్ని సబ్జెక్టులు చదవడం తేలిక అవుతుంది.

– వెదురు రసల్యారెడ్డి, 6వ తరగతి, శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్

ఇంగ్లిష్‌పై పట్టు సాధించవచ్చు..



కొంతమందికి ఇంగ్లిష్ సబ్జెక్టు అంటే భయం ఉంటుంది. సాక్షి ఆధ్వర్యంలో స్పెల్ బీ పరీక్షలు నిర్వహించడం వల్ల సబ్జెక్టుపై పట్టు సాధించవచ్చు. ఇకనుంచి ప్రతి ఏడాది సాక్షి నిర్వహించే అన్ని పోటీ పరీక్షలకు హాజరవుతా.

– ఎం.జెస్సికారెడ్డి, 9వ తరగతి, నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్

సమగ్ర కుటుంబ సర్వేకు సన్నద్ధం..

- మూడురోజుల పాటు ప్రతీ ఇంటికి స్టిక్కర్లు
- డివిజన్‌లో 651 మంది ఎన్యూమరేటర్లు
- నివాసాలు 90,535, సూపర్‌వైజర్లు 65 మంది



సత్తుపల్లిలో సిబ్బందికి సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిబాబు

సత్తుపల్లిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. సత్తుపల్లి మున్సిపాలిటీ నియోజకవర్గంలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలల్లో ఇంటింటి సర్వేకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా పని చేయాల్సిన వారికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు.

ఇంటింటికీ స్టిక్కర్లు..

ఈ సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లకు 150 నుంచి 175 ఇళ్లు కేటాయించారు. వీరు రెండురోజులుగా ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటిస్తూ కేటాయించిన ఇళ్లను గుర్తిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి అందుబాటులో ఉంటాలని సమగ్ర సర్వేపై అవగాహన కల్పించటంలో ఎన్యూమరేటర్లు నిమగ్నమయ్యారు. ఈ సర్వేలోని అంశాల ఆధారంగానే సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, అమలు చేపట్టనున్నట్లు సమాచారం. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలకు సమగ్ర సర్వే నివేదికను ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సర్వే బృందంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపాల్ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు తదితర సిబ్బందిని నియమించారు. వారికి కావాల్సిన మెటీరియల్స్, సర్వే పత్రాలు, పెన్నులు ఇతర సామగ్రిని అందచేస్తున్నారు.

సర్వే ప్రక్రియ ఇలా..

ఈ నెల 6వ తేదీ నుంచి సమగ్ర సర్వే ప్రారంభం కానుంది. 18వ తేదీకల్లా ముగిసేలా కార్యాచరణ రూపొందించారు.75 ప్రశ్నాలతో ఈ సర్వే నిర్వహించనున్నారు. 19వ తేదీన డేటా ఎంట్రీ ఈ నెలాకరుకు పూర్తిస్థాయి డేటా అందించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతి పదిమంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. ప్రతి ఎన్యూమరేటర్ 150 నుంచి 170 ఇళ్లు వివరాలు తీసుకునేలా బ్లాక్‌మ్యాప్‌లు సిద్ధం చేశారు.

ప్రజలు సహకరించాలి..



సమగ్రసర్వేకు ప్రజలు సహకరించాలి. సత్తుపల్లి నియోజకవర్గంలో సమగ్ర సర్వే కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ప్రజలు సర్వే సిబ్బందికి వాస్తవ సమాచారం ఇవ్వాలి. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించి శిక్షణ ఇచ్చాం. సర్వే విజయవంతంగా చేయటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

– ఎల్.రాజేంద్రగౌడ్, ఆర్డీఓ, కల్లూరు

సొసైటీ సేవలను రైతులు వినియోగించుకోవాలి



రుణాలు అందజేస్తున్న మేనేజర్ దివ్య, సొసైటీ చైర్మన్ అక్కిరెడ్డి

చింతకాని: సొసైటీ అందిస్తున్న సేవలను రైతులందరూ వినియోగించుకోవాలని సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి తెలిపారు. చింతకాని సొసైటీలో సోమవారం రూ.59.22 లక్షల పంట రుణాలను రైతులకు ఇవ్వటం జరిగిందన్నారు. రైతులకు సొసైటీ ద్వారా ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, వ్యవసాయ పరికరాలను అందజేయటం జరుగుతుందని తెలిపారు. అలాగే సొసైటీ ఆధ్వర్యంలో చింతకాని, నాగిలిగొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించటం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు మాదిని రవి, డైరెక్టర్లు జల్లి కుమారి, ఇలారపు బాబు, సీఈఓ మారగాని శ్రీనివాసరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద గోపవరం సొసైటీ పరిధిలో..

ఎర్రుపాలెం: మండలంలోని పెద్ద గోపవరం సొసైటీ పరిధిలోని 29 మంది రైతులకు రూ.28.60 లక్షల రుణాలను సోమవారం మండలకేంద్రంలోని సహకార బ్యాంక్ మేనేజర్ దివ్య, సొసైటీ అధ్యక్షుడు శీలం అక్కిరెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ వీరారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి



రైతులకు కెపాసిటర్లు అందజేస్తున్న ఏఈ శ్రీనివాస్

ముదిగొండ: మండలంలోని రైతులు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని మేడేపల్లిలో రైతులకు ఆయన అవగాహన కల్పించారు. కెపాసిటర్లు బిగించడంతో మోటార్లు వేడెక్కడం తగ్గి కాలిపోకుండా ఎక్కువకాలం మన్నికగా ఉంటాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ తగ్గి లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. ఎదైనా సమస్య ఉంటే సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మాజీ సర్పంచ్ రమేష్, సిబ్బంది నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ప్రభుత్వం



ఐఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న దుర్గాప్రసాద్

చింతకాని: కార్మికులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఐఎన్‌టీయూసీ జెండాను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. వివిధ కార్మిక సంఘాల నుంచి 400 మంది కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరటం అభినందనీయమని తెలిపారు. సందర్భంగా హమాలీ కార్మికులు దుర్గాప్రసాద్‌ను సన్మానించారు. అనంతరం మండలంలోని తిమ్మినేనిపాలెంలో మాజీ ఎంపీపీ కోపూరి పూర్ణయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శ్రీనివాసరావు, శ్రీనివాస్ యాదవ్, ఐఎన్‌టీయూసీ మండల గౌరవ అధ్యక్షుడు గోవిందరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లలు విడుదల

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన చేప పిల్లలను చెరువులో సీపీఐ మండల సహాయ కార్యదర్శి దూసరి గోపాలరావు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు ఉచితంగా చేప పిల్లలను అందజేస్తున్నందున పిల్లలను పెంచి మంచి లాభాలను సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సొసైటీ సభ్యులు పులిపాటి వీరభద్రం, బాబు, మట్టా రవి, మల్లయ్య, పులిపాటి శేషగిరిరావు, శ్రీను, షేక్ దస్తగిరి, మట్టా నర్సింహారావు, బండి నగేష్, అన్నపురెడ్డి గురవయ్య, మట్టా ఉపేందర్, మత్స్య శాఖ సిబ్బంది భానుప్రసాద్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బీబీసీ కాల్వకు మరమ్మతులు చేయాలి

బోనకల్: బోనకల్ బ్రాంచ్ కాల్వకు మరమ్మతులు చేయాలని కోరుతూ.. రైతులు, అఖిలపక్ష నాయకులు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు ఆనందరావు, జానీమియా, శ్రీనివాసరావు, ప్రసాద్‌లు మాట్లాడారు. డ్రాప్ లేక పోవడంతో పలుగ్రామాల రైతులు సాగునీరుకై ఎదురుచూస్తున్నారన్నారు. అనంతరం పలువురు రైతులు ఎన్‌ఎస్‌పీ డీఈ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పవన్, ముస్తాఫా, ఖాసీమ్, చాంద్‌పాషా, రైతులు వెంకన్న, రామారావు, గోవర్ధన్, నాగేశ్వరరావు ఆదినారాయణ, వేణు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు చేపట్టాలి



పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

మధిర: సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం రోజులు గడిచినప్పటికీలోక కింటా కూడా పత్తి కొనుగోలు చేయలేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆరోపించారు. మండలంలో ఉన్న పత్తి కొనుగోలు కేంద్రాలను సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి కొనుగోళ్లకు కావాలిన ఏర్పాట్లును బయ్యర్లు ఇప్పటివరకు చేయలేదని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పత్తికి క్వింటాకు రూ.15వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మందా సైదులు, పాపినేని రామ నరసయ్య, శీలం నరసింహారావు, పడకంటి మురళి, తెలప్రోలు రాధాకృష్ణ పాల్గొన్నారు.

జామే మసీదు కమిటీకి మంత్రి తుమ్మల అభినందన



సత్తుపల్లి జామే మసీదు కమిటీని సత్కరిస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జామే మసీదు, మార్కెట్ మసీదు సదర్‌గా ఎన్నికైన నాయబ్ రసూల్, కార్యదర్శి ఎమ్‌డీ కమల్ పాషాలను రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. జామే మసీదు కమిటీ బాధ్యులు సోమవారం దమ్మపేట మండలం గండుగులపల్లిలో మంత్రి తుమ్మలను కలిశారు. మసీదు అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎండీ షాకీర్, గ్రాండ్ మౌలాలి, రహమత్‌పాషా, అమీర్, జాని, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి వినతి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్టిజన్లు

కల్లూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హెచ్-82 టీజీ జెన్కోపాల్వంచ కేటీపీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సోమవారం కల్లూరులో కలిసి వినతిపత్రం అందించారు. ఏపీఎస్ఈబీ సర్వీస్‌రూల్స్ వర్తింపచేసి కన్వర్షన్ చేయాలని, ఆర్టిజన్ కార్మికులందరికీ క్వార్టర్ సదుపాయం కల్పించాలని, మెడికల్ సౌకర్యంతో పాటు సెలవులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి సీఎండీతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆర్టిజన్లు తెలిపారు. కృష్ణారెడ్డి, అనీల్‌కుమార్, శ్రీనివాసులు, సాంబశివరావు తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు..

కల్లూరురూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ.. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ సంబశివుడికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ మాస్‌లైన్ కార్యదర్శి కె.పుల్లారావు, డివిజన్ నాయకుడు జె.మాల్యాద్రి, ఎన్.మంగన్న మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులు దాటినప్పటికీ ఇంత వరకు ధాన్యం కొనుగోలు చేయలేదన్నారు.

రైతుల వివరాలు వెల్లడించాలి

బోనకల్: పంట నష్టపరిహారం పేరుతో వ్యవసాయాధికారులు నిర్వహించిన సర్వేలో రైతుల వివరాలు వెల్లడించాలని ఏఐకేఎస్ మండల అధ్యక్షుడు ఏలూరి పూర్ణచంద్రరావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. ఈ విషయంపై ధర్నా చేసిన పట్టించుకోలేదన్నారు. అధికారుల సర్వేలో 10 గుంటల ఎకరం భూమిగాచూపి రైతులకు నష్టపరిహారం అందించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆనందరావు, కృష్ణయ్య, పవన్ తదితరులున్నారు.

గ్రామాల్లో కుల గణన స్టిక్కరింగ్



కారేపల్లి: శివాలయం వీధిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సురేందర్



ఎర్రుపాలెం: తక్కెళ్లపాడులో..

కారేపల్లి: కారేపల్లిలోని రైల్వే స్టేషన్ బజార్, శివాలయం వీధిలలో ఎన్యూమరేటర్ జాకీర్‌బాబా కుటుంబ సర్వే కార్యక్రమాన్ని చేపట్టగా.. ఎంపీడీఓ సురేందర్ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో సింగరేణి పంచాయతీ కార్యదర్శి నవీన్, సీఆర్‌పీ విజయ్, మోతిలాల్, పాల్గొన్నారు.

● **ఏన్కూరు:** మండలంలోని తిమ్మరావుపేట, మర్సకుంట, రాజలింగాల సర్వేకు సంబంధించిన విషయాలను వైరా నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాంబాబు పరిశీలించారు. ఉపాధ్యాయులు సర్వే నిర్వహించి స్టిక్కర్లు అంటిస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ టీవీఎస్ నారాయణ పాల్గొన్నారు

● **ముదిగొండ:** గ్రామపంచాయతీల్లోని ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్లు అంటించాలని ఎంపీఓ వాల్మికి కిషోర్ సిబ్బందికి సూచించారు. అనంతరం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, అనీల్, రమేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● **ఎర్రుపాలెం:** మండలంలోని తక్కెళ్లపాడులో ఇంటింటికీ సర్వే టీమ్ స్టిక్కర్లు అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రూపొందించిన నమూనాలో సర్వే నిర్వహణకు సమాయత్తం అవుతున్నారు.

● **కల్లూరురూరల్:** మండలంలో సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే విధానాన్ని ఆర్డీఓ రాజేందర్.. ఎమ్మెల్యే రాగమయికి వివరించారు. కల్లూరు మండలంలో సర్వే నిర్వహించేందుకు గాను 135 మంది ఎన్యూమరేటర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ నీరజాదేవి, ఎంపీఓ సురేష్‌బాబు, ఏఓ రూప, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పెనుబల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరురూరల్/పెనుబల్లి: రాష్ట్రంలో రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి స్పష్టం చేశారు. సోమవారం కల్లూరు మండలంలోని చండ్రుపట్ల గ్రామంతో పాటుగా.. పెనుబల్లి మండలంలోని గణేషన్‌పాడు, ముత్తగూడెం, పాతకుప్పెనకుంట్ల, తుమ్మలపల్లి, బయ్యన్నగూడెం, వియంబంజర్, పెనుబల్లి గ్రామాల్లో ఐకేపీ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతు రుణాలు మాఫీ, సన్నరకం ధాన్యానికి రూ.500ల బోనస్, గృహ నిర్మాణాలు తదితర ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకొని నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్డీఓ రాజేందర్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగం నీరజాదేవి, తహసీల్దార్లు ప్రతాప్, సాంబశివుడు, ఎంపీడీఓలు అన్నపూర్ణ, చంద్రశేఖర్, వ్యవసాయాధికారులు రూప, ఏవీఎస్ రాజు, చెన్నూరు సొసైటీ సీఈఓ దేవరపల్లి మురళి, ఐకేపీ ఏపీఎం నాగపుల్లారావు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రంగబంజర గ్రామంలో..

తల్లాడ: మండలంలోని రంగంబంజర గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గంగదేవిపాడు సొసైటీ అధ్యక్షుడు తూము వీరభద్రరావు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాచబంటి త్రివేణి, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘుపతిరెడ్డి, లచ్చిరెడ్డి, దశరథ్ నాయక్, రవి, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కార్తీక మాసం ప్రత్యేక పూజలు

కార్తీక సోమవారం సందర్భంగా మండలంలో పలు ఆలయాలు శివనామ స్మరణలతో మార్మోగాయి. తెల్లవారు జామునుంచే భక్తులు దీపాలు వెలిగించి ఆలయాల్లో పూజలు నిర్వహించి దీపారాధన చేశారు. అర్చకులు శివునికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిట లాడాయి.

– సాక్షి నెట్‌వర్క్



వైరా: పాత శివాలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు



కొణిజర్ల: పల్లిపాడు శివాలయంలో..



సత్తుపల్లిలో శివలింగానికి అభిషేకం చేస్తున్న దృశ్యం